
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 16 జూలై 2024



పేదింటి పొట్ట నింపేందుకు ఒకరు.. సొంతూరు వదిలి వలస వచ్చి బతుకీడుస్తున్న వారు ఇంకొకరు.. కష్టాల కుటుంబంలో కన్నీటితో జీవిస్తున్నవారు మరొకరు.. కదిలిస్తే చాలు.. పరిటాల రాతి క్వారీ ప్రమాదంలో మృతులు, వారి కుటుంబ సభ్యుల కన్నీటి కథలు కంటతడి పెట్టిస్తున్నాయి. మృతుల్లో ఒకరు ఎన్టీఆర్ జిల్లా వాసి కాగా, మరో ఇద్దరు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి కూలి పనులు చేసుకుంటున్నవారు. కుటుంబాలకు ఆధారమైన వీరు తనువు చాలించడంతో మిగిలినవారంతా అనాథలయ్యారు. - జి.కొండూరు

పంచాయతీ నిధులు పక్కదారి!

గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్టుంది పంచాయతీల దుస్థితి. అసలే నిధులు లేక సతమతమవుతున్న గ్రామ పంచాయతీలకు ప్రతినెలా వచ్చే సర్‌చార్జి స్టాంపు డ్యూటీ 2022 డిసెంబరు నుంచి ఆగిపోయింది. గత ప్రభుత్వం వీటిని పక్కదారి పట్టించి పంచాయతీలను గాలికి వదిలేసింది. ఒక్క చల్లపల్లి పంచాయతీకి ఏడాదికి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు సర్‌చార్జి స్టాంపు డ్యూటీ ఆగిపోయింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.

గ్రామ పంచాయతీలకు జమకాని సర్‌చార్జి స్టాంపు డ్యూటీ



- 2022 డిసెంబరు నుంచి జమచేయని రిజిస్ట్రేషన్‌శాఖ
- గత ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే కారణం
- ఒక్క చల్లపల్లి పంచాయతీకి రూ.35 లక్షలు పెండింగ్
- జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి
- నిధులు విడుదల చేయాలని కోరుతున్న సర్పంచ్‌లు

చల్లపల్లి : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే వ్యాపార భవనాలు, స్థలాలు, నివేశనా స్థలాలు, పొలాల క్రయవిక్రయాలకు సంబంధించి కొనుగోలుదారులు ప్రభుత్వం నిర్ధారించిన మార్కెట్ వాల్యూ ఆధారంగా చెల్లించే స్టాంపు డ్యూటీలో 5 శాతం పంచాయతీలకు జమచేయాల్సి ఉంటుంది. దీనినే సర్‌చార్జి స్టాంపు డ్యూటీ అని అంటారు. ఏయే గ్రామాల్లో భూములకు సంబంధించిన లావాదేవీలు జరిగాయో రిజిస్ట్రేషన్‌శాఖకు ఆ మేరకు స్టాంపు డ్యూటీలో నుంచి 5 శాతం సర్‌చార్జి స్టాంపు డ్యూటీని ఆయా గ్రామ పంచాయతీలకు జమచేయాలి. నెలవారీగా ఈ సర్‌చార్జి స్టాంపు డ్యూటీ పంచాయతీల ఖాతాకు జమ చేస్తుంటారు. మేజర్ గ్రామ పంచాయతీలకు, వ్యాపార, వ్యవసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయాలు ఎక్కువగా జరిగే పంచాయతీలకు సర్‌చార్జి స్టాంపు డ్యూటీ లక్షల్లోనే వస్తుంటుంది.

చల్లపల్లిలో భూక్రయవిక్రయాలు అధికం

మండల కేంద్రమైన చల్లపల్లిలో వ్యవసాయభూమి లేకున్నా వ్యాపారపరంగా, నివాసిత భూములపరంగా క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ పంచాయతీకి ఏడాదికి సుమారుగా రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు సర్‌చార్జి స్టాంపు డ్యూటీ వస్తుంటుంది. ఈ ఆదాయాన్ని గ్రామ పంచాయతీ సాధారణ నిధులు కింద గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తారు.

గత ప్రభుత్వ ఆదేశాలతో స్టాంప్ డ్యూటీ మళ్లింపు

గత ప్రభుత్వ విధానాల కారణంగా 2022 డిసెంబరు నుంచీ గ్రామ పంచాయతీలకు సర్‌చార్జి స్టాంపు డ్యూటీ నిలిచిపోయింది. గ్రామ పంచాయతీలకు స్టాంపు డ్యూటీ జమచేయవద్దనే ప్రభుత్వ మౌఖిక ఆదేశాలతో రిజిస్ట్రార్లు స్టాంపు డ్యూటీ మొత్తాన్ని జమచేయటం లేదు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన గత ప్రభుత్వం, పంచాయతీలకు రావాల్సిన నిధులను దారిమళ్లించటంతో ఆర్థికంగా పంచాయతీలు కుదేలయ్యాయి. దివిసీమలో వ్యాపార కూడలిగా ఉన్న చల్లపల్లి గ్రామ పంచాయతీకి సర్‌చార్జి స్టాంపు డ్యూటీ జమచేయని కారణంగా ఇప్పటి వరకూ రూ.35 లక్షలకుపైగానే పంచాయతీ రాబడి నిలిచిపోయింది.

ల్యాండ్ సెస్ కూడా మళ్లింపు

ల్యాండ్ సెస్ గత కొన్నేళ్లుగా నిలిచిపోయింది. రెవెన్యూశాఖ ఏటా రైతుల నుంచి వసూలు చేసే నీటి శిస్తులలోనూ గ్రామ పంచాయతీలకు వాటా ఉంటుంది. ఏటా గ్రామాల్లో ఎంత నీటితీరువా వసూలు చేశారో, వసూలు చేసిన తర్వాత రీ కన్సలేషన్‌చేసి పంచాయతీలకు జమచేస్తుంటారు. ఈ శిస్తులు సైతం జమకాకపోవటంతో పంచాయతీలకు రాబడి తగ్గిపోయినట్లయింది.

కూటమి ప్రభుత్వంపై పంచాయతీల ఆశలు

స్థానిక సంస్థలకు జవసత్వాలు కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పటిష్టపరిచే చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎప్పటి నుంచో నిలిచిపోయిన సర్‌చార్జి స్టాంపు డ్యూటీని తక్షణమే బకాయిలతో సహా పంచాయతీలకు జమచేయటంతోపాటు, ల్యాండ్ సెస్‌ను సైతం జమచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే విషయమై ఇటీవల జరిగిన చల్లపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి సమస్యను ప్రస్తావించారు. సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు, అధికారులకు వివరించారు.



ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్లతో బండల తొలగింపు



దుర్గారావు (ఫైల్)



బీబీ నాయక్ (ఫైల్)



రామ్‌దేవ్ బాగేల్ (ఫైల్)

బతుకు బండలు

పరిటాల రాతి క్వారీ ప్రమాదంలో కన్నీటి కథలు

చేతికొచ్చిన బిడ్డను కోల్పోయి ఒకరు

- పొట్టకూటి కోసం వలస వచ్చి మరో ఇద్దరు మృతి
- ఆధారం కోల్పోయి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చితికిపోయిన బతుకులు

జి.కొండూరు మండలం చెర్వుమాధవరం గ్రామానికి చెందిన బత్తుల చంద్రం-రాఘవల పెద్ద కుమారుడు దుర్గారావు. టెన్త్ వరకు చదివి తండ్రి చేస్తున్న డ్రిల్లింగ్ పని నేర్చుకుని కుటుంబానికి ఆధారంగా ఉంటున్నాడు. క్వారీ ప్రమాదంలో దుర్గారావు మృతిచెందడంతో ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. త్వరలో మంచి సంబంధం చూసి, పెళ్లి కూడా చేయాలనుకుంటున్న తరుణంలో కన్నబిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని కంటతడి పెట్టారు.

పొట్టకూటి కోసం వలస వచ్చి..

పొట్టకూటి కోసం ఒడిశా నుంచి 20 ఏళ్ల కిందట ఇక్కడికి వలస వచ్చాడు బీబీ నాయక్. ఈ ప్రాంతంలో క్వారీ పనులు చేసుకుంటూ జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఓ చిన్న రేకుల షెడ్డులో అద్దెకు ఉంటున్నాడు. రెక్కాడితే కానీ, డొక్కాడని నాయక్ రోజూ మాదిరిగానే భార్య, పిల్లలకు చెప్పి పని నిమిత్తం బయల్దేరాడు. కాసేపటికే ఆయన మరణ వార్త విన్న ఆ కుటుంబం రోదిస్తోంది.

ఆధారం లేక..

మరో కార్మికుడైన రామ్‌దేవ్ బాగేల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవాడు. ఈయన కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ ప్రమాదంలో భర్తను కూడా కోల్పోయిన జయమణి బోరున విలపించింది. కూతురు అనీషా (12) ఉంది. తండ్రికి ఏమైందో తెలియక అనిషా బిక్కుబిక్కుమంటూ ఇంటి వద్దే ఉండటం చుట్టుపక్కల వారికి కన్నీరు తెప్పించింది.

మృతుల కుటుంబాలకు రూ.8.5 లక్షల పరిహారం

కంచికచర్ల రూరల్ : క్వారీ ప్రమాదంలో మృతిచెందిన బత్తుల దుర్గారావు, బీబీ నాయక్, రామ్‌దేవ్ బాగేల్ కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.8.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు క్వారీ యజమాని రామ్మోహన్‌రావు ఒప్పుకున్నారు. ఇందుకు మృతుల కుటుంబాలు సైతం అంగీకారం తెలిపారు.

ముసిరిన వాన

నాగాయలంకలో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం



వర్షానికి వల్లమన్నాడులో మునిగిన వరి పొలాలు

- సాగు పనుల్లో రైతులు
- మరో మూడ్రోజులు భారీ వర్ష సూచన

మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సోమవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో వర్షం దంచికొట్టింది. మొదటి రెండు రోజులు చిరు జల్లులు కురిసినప్పటికీ సోమవారం జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీగా వర్షం కురిసింది. పొలాల్లో నీరు నిలిచింది. ఈ పాటికే వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన పొలాలు నీటిలో తేలాడుతున్నాయి. గుడ్లవల్లేరులోని వరి పొలాలు నీట మునిగాయి. మిగిలిన మండలాల్లో మోస్తరు వర్షం పడటంతో సాగుకు అనుకూలించింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షానికి రహదారులన్నీ నీటితో నిండాయి. గత ఐదేళ్లలో రోడ్ల నిర్మాణం లేకపోవడంతో గుంతల రహదారుల్లో నీరు నిండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈనెల 19వ తేదీ వరకు కోస్తా తీరం వెంబడి ఒక మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సోమవారం హెచ్చరికలు జారీ చేసింది. సోమవారం ఉదయం 8.30 గంటలవరకు జిల్లాలో అత్యధికంగా నాగాయలంకలో 26.4 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా గుడివాడలో 1.6 మిల్లీమీటర్లు, జిల్లా సగటువర్షపాతం 7.4 మిల్లీమీటర్లుగా నమోదైంది. మొవ్వలో 20.8, చల్లపల్లిలో 16.8, మచిలీపట్నంలో 16.2, అవనిగడ్డలో 14.8, పామర్రులో 11.4, మోపిదేవిలో 11.2, గూడూరులో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 10 మిల్లీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది.



మచిలీపట్నం హౌసింగ్‌బోర్డు కాలనీలో పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వర్షపునీరు

మూడేళ్లుగా గుంతల్లోనే ప్రయాణం



మచిలీపట్నం-కోన రహదారి వెంబడి కృష్ణా యూనివర్సిటీ వద్ద గోతులమయంగా మారిన రహదారి

కృష్ణా యూనివర్సిటీ రహదారికి మోక్షమేదీ?

- రూ.10 కోట్లతో టెండర్లు పిలిచి రెండేళ్లు
- ఎన్నికల సమయంలోనూ రహదారికి కనీస మరమ్మతులు చేయని వైనం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు, ప్రజలకు ఇక్కట్లు

మచిలీపట్నం శివారు ప్రాంతం నుంచి కృష్ణా యూనివర్సిటీ వరకు నాలుగులేన్ల రహదారి విస్తరణ పనులు ఇప్పట్లో జరిగేలా లేవు. మూడేళ్ల క్రితమే అంచనాలు పూర్తయి, టెండర్లు పిలిచినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. అధ్వానంగా మారిన రహదారిపై ప్రయాణించాలంటే యూనివర్సిటీ విద్యార్థులు, పలుగ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటే వేలాది మందికి ప్రయోజనంగా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం - కోన రహదారి వెంబడి మచిలీపట్నానికి మూడు కిలోమీటర్ల దూరంలో కృష్ణా యూనివర్సిటీ ఉంది. శివగంగ గుడి మలుపు నుంచి కృష్ణా యూనివర్సిటీ వరకు ఉన్న రహదారిని నాలుగులేన్లుగా విస్తరించేలా గతంలో అంచనాలు రూపొందించారు. వివిధ రాజకీయ కారణాలతో ఈ రహదారి విస్తరణను కొంతమేర కుదించారు. మంగలేరు వంతెన నుంచి యూనివర్సిటీ వరకు 2,100 మీటర్ల మేర నాలుగులేన్లుగా విస్తరించేందుకు రూ.10 కోట్లతో అంచనాలు తయారుచేసి టెండర్లు పిలిచారు. అయినా ఈ పనులు ప్రారంభంకాలేదు. ఈ రహదారి వెంబడి కోన, పోలాటితిప్ప, పాతేరు, గణపతినగర్, పల్లెతుమ్మలపాలెం గ్రామాలకు చేరుకోవాల్సి ఉంది. ఈ గ్రామాల ప్రజల మచిలీపట్నం రావాలంటే ఈ రహదారే ప్రధాన ఆధారం. కృష్ణా యూనివర్సిటీకి నిత్యం వెయ్యిమందికిపైగా విద్యార్థులు చదువుకునేందుకు, 200 మందికిపైగా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విధుల నిమిత్తం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఐదు గ్రామాల్లోని ప్రజలు ప్రతి అవసరానికి మచిలీపట్నం వచ్చి వెళుతుంటారు. ఈ రహదారి వెంబడి వేలాది ఎకరాల చేపలు, రొయ్యల చెరువులు ఉన్నాయి. అయినా ఈ రహదారి విస్తరణ పనులు చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందనే విమర్శలు ఉన్నాయి.

కనీస మరమ్మతులు కరువు

ఎన్నికల నోటిఫికేషన్‌కు విడుదలకు మూడు రోజుల ముందు మచిలీపట్నం-కోన రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. గుంతలు పూడ్చి మమ అనిపించారు. మంగలేరు వంతెన వద్ద నుంచి కృష్ణా యూనివర్సిటీ వరకు రహదారికి కనీస మరమ్మతులు కూడా చేయలేదు. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను యూనివర్సిటీలోనే భద్రపరిచి, ఎన్నికల కౌంటింగ్ కూడా ఇక్కడే నిర్వహించారు. ఇంతా జరిగినా కృష్ణా యూనివర్సిటీకి చేరుకునే రహదారిని మాత్రం కనీస మరమ్మతులు కూడా చేయకుండా మిన్నకుండిపోయారు. గతంలోనే అస్తవ్యస్తంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మరింత గోతులమయంగా మారింది. 2022లో కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అతిథులు వస్తున్నారనే కారణంతో అర కిలోమీటరు దూరం మేర తూతూమంత్రంగా మరమ్మతులు చేసి అప్పట్లో చేతులు దులుపుకున్నారు. 2023-24 సంవత్సరాలకు సంబంధించి మరో రెండు నెలల్లో కృష్ణా యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ హాజరవుతారని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఈ లోగానైనా ఈ రహదారి విస్తరణ పనుల్లో కదలిక వస్తుందో రాదో తెలియని స్థితి నెలకొంది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణా యూనివర్సిటీ వరకు రహదారిని నాలుగులేన్లుగా విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించినా పనులు ప్రారంభించేందుకు అనువైన పరిస్థితులు కల్పించలేదనే విమర్శలున్నాయి. ఈ రహదారి వెంబడి ఇరువైపులా హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌లు కూడా రహదారి పక్కనే ఉన్నాయి. వీటిని పక్కకు మార్చేందుకు నిధులు విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసింది. విద్యుత్ స్తంభాలు, పైప్‌లైన్‌ను మారిస్తే రహదారి పనులు ప్రారంభించడానికి సిద్ధమేనని కాంట్రాక్టర్ చెప్పినా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారి విస్తరణ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా ఈ రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించి నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, కృష్ణా యూనివర్సిటీ విద్యార్థులు కోరుతున్నారు.



ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం..

- కలెక్టర్ బాలాజీ

6లో..

అడ్డగోలుగా..!

- రహదారిపై విద్యుత్ లైన్లకు అడ్డు వున్నాయని..
- ఇష్టానుసారంగా భారీ వృక్షాల నరికివేత
- ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చెట్ల తొలగింపుపై ప్రజల ఆగ్రహం

6లో..

మరొకరు మృతి

అల్ట్రాటెక్ ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



బొంతు శివనారాయణ (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, జూలై 15 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొంతు శివనారాయణ (45) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం పేరాల గ్రామానికి చెందిన శివనారాయణ.. అల్ట్రాటెక్ కంపెనీలో ఎలక్ట్రీషియన్ సెక్షన్‌లో పని చేస్తూ, ఆ కంపెనీ క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. ఆయనకు భార్య సీత ఉన్నారు. ఆయన మృతితో పరిహారం కింద ఇస్తున్న రూ.50 లక్షల చెక్కును తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు.

మరో ఇద్దరి పరిస్థితి విషమం

అల్ట్రాటెక్ కర్మాగారంలో బాయిలర్ పేలిన ఘటనలో గాయపడిన 16 మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా మారటంతో ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. శివనారాయణ సహా ఇప్పటికే నలుగురు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

శిశువు అపహరణ కేసులో మహిళ అరెస్ట్

గంటల వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

6లో..

అడ్డుగోలుగా..!

- రహదారిపై విద్యుత్ లైన్లకు అడ్డు వున్నాయని..
- ఇష్టానుసారంగా భారీ వృక్షాల నరికివేత
- ఇటుకబట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చెట్ల తొలగింపుపై ప్రజల ఆగ్రహం

మైలవరంరూరల్, జూలై 15 : కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కొందరు అధికారులు పెడచెవిన పెడుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో రహదారి వెంబడి ఉన్న చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. సంవత్సరాల నాటి భారీ వృక్షాలను సైతం తెగనరికి సొమ్ముచేసుకుంటున్నారు. మైలవరం-పొందుగల, పొందుగల-అనంతవరం పంచాయతీరాజ్ రహదారి వెంట భారీ వృక్షాలు సంవత్సరాలుగా ప్రజలకు నీడనిస్తున్నాయి. అయితే కొద్దిరోజులుగా మైలవరం సబ్ స్టేషన్ నుంచి పొందుగల, అనంతవరం గ్రామాలకు 24గంటల విద్యుత్ సరఫరా నిమిత్తం కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నాడు. పంచాయతీరాజ్ రహదారి వెంబడి స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌ను లాగుతున్నారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను పదుల సంఖ్యలో మొదలు వరకు తొలగించివేస్తున్నారు. విద్యుత్ లైన్ పనులను కాంట్రాక్టర్‌కు అప్పచెప్పి అధికారులు చేతులు దులుపుకోవడంతో కాంట్రాక్టర్ చెట్లను నరికి ఇటుక బట్టీలకు అమ్ముకోవడం గమనార్హం. పెద్ద ఎత్తున చెట్లు నరుకుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అభివృద్ధి పనులకు చెట్లు అడ్డువస్తే కొమ్మలు తీసివేయడం సర్వసాధారణం. లేదా ఆధునిక పద్ధతిలో ఆ చెట్టును వేరొక చోటకు తరలించాలి.. కానీ మొదళ్ల వరకు చెట్లు నరికివేస్తుండటంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడనిచ్చే చెట్లను పెద్ద సంఖ్యలో నరికివేస్తుంటే బాధ్యత గల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికులు సైతం అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడీ వివరణ : ఈ విషయంపై మైలవరం విద్యుత్‌శాఖ ఏడీ సుధాకర్‌ను వివరణ కోరగా విద్యుత్ లైన్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా అవసరమైన మేరకు చెట్లను తొలగించవచ్చునని, చెట్లు నరికివేసిన విషయం తెలియదన్నారు. చెట్ల తొలగింపు విషయంపై ఆరా తీస్తానన్నారు.




పొందుగల సమీపంలో నరికేసిన చెట్లు.. ట్రాక్టర్‌పై కొమ్మల తరలింపు



జాతీయ రహదారిపై కట్టుబడిపాలెం వద్ద నిలిచిన వర్షపు నీరు

జాతీయరహదారిపై వర్షపు నీరు

- పట్టని అధికారులు.. వాహనదారుల కష్టాలు

జి.కొండూరు, జూలై 15 : ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారిపై వర్షపు నీరు 100 మీటర్ల మేర మోకాళ్ల లోతున నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇంజన్లలోకి నీరు చేరుతుందా అన్నంతగా నీరు నిలిచిపోయింది. కట్టుబడిపాలెం వద్ద హెచ్‌పీసీఎస్-బీసీపీఎల్ కంపెనీల మధ్య గతంలో సహజసిద్ధ వాగు కొందరు ఆక్రమణదారుల చెరపడటంతో పూడిపోయి వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా రహదారిపైనే నిలుస్తున్నది. దీనిపై కట్టుబడిపాలెం సర్పంచ్ డి.సత్యావతి ఆర్.ఎస్ నంబరు 109, 110, 118, 111లను సర్వే చేయించి వాగును సరిచేయాలని వినతిపత్రం ఇచ్చినా అధికారుల్లో చలనం లేదు. ఎన్.హెచ్ అధికారులకు సమాచారం ఇద్దామన్నా ఫోన్‌కు స్పందించడం లేదని ఆమె తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం సర్వే చేయించి వాగును పునరుద్ధరించాలని, రోడ్డుపై వర్షపు నీటిని బయటకు పంపే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వరద నీరు.. పంట పొలాల్లోకి వరద నీరు

పొంగిపొర్లిన దొర్లింతల వాగు

- పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు.. ఇబ్బందులు పడిన ప్రజలు

జి.కొండూరు, జూలై 15 : మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు తోడు భారీ వర్షంతో పలు వాగులు పొంగి పొర్లాయి. గడ్డమణుగులోయ నుంచి దొర్లింతల వాగుకు భారీగా వరద వచ్చి చేరింది. అయితే వరద పులివాగులో కలిసే ప్రాంతంలో దొర్లింతల వాగు ఆక్రమణలకు గురికావడంతో వరద నీరు ఎగదన్ని కేజీవై రోడ్డుపై ఉన్న గెయిల్ నుంచి పరిసర ప్రాంతాల్లో ఉన్న పల్లపు ప్రాంతాలు, పొలాలను ముంచెత్తింది. దీంతో స్థానిక నివాసితులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



జోరువానలో జగ్గయ్యపేట డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

హైర్ బస్సుల బదలాయింపుపై జేఏసీ ధర్నా

జగ్గయ్యపేట, జూలై 15 : జగ్గయ్యపేట డిపో నుంచి హైర్ బస్సులను విజయవాడ డిపోకు బదలాయించడాన్ని నిరసిస్తూ ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల జగ్గయ్యపేట డిపో మనుగడకే ముప్పు వాటిల్లనుందని, డిపో ఆదాయానికి ఆయువు పట్టులా ఉన్న రూట్‌లో బస్సులను విజయవాడ డిపోకు బదలాయించటం వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆరోపించారు. అధికారులు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో జేఏసీ నేతలు ఆనంద్, హిమామ్, భాస్కరరావు, వీఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిపో మేనేజర్ రఘురాంకు వినతిపత్రం అందజేశారు.

పార్లమెంట్‌లో జనగళం వినిపిస్తా.. : బాలశౌరి



మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ వల్లభనేని బాలశౌరిని మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు, పవన్‌కల్యాణ్ ఆశయాలను నెరవేర్చేందుకు తనవంతుగా పార్లమెంటులో గళం వినిపిస్తానన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులను తీసుకువచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు. బందరుపోర్టు అభివృద్ధితోపాటు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకోసం పనిచేస్తానని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో జాతీయరహదారుల నిర్మాణానికి, విస్తరణకు అనుమతులు, నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో చాంపియన్ ఎన్టీఆర్ జిల్లా

విజయవాడ స్పోర్ట్స్, జూలై 15 : కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం ముగిసిన 9వ ఆంధ్రప్రదేశ్ జూనియర్, సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల(రాష్ట్రస్థాయి) స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 30 స్వర్ణాలు, 21 రజతాలు, 14 కాంస్యాలతో మొత్తం 227 పాయింట్లతో అగ్రస్థానాన్ని జిల్లా స్విమ్మర్లు వశం చేసుకున్నారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఐ.రమేష్ తెలిపారు. కృష్ణాజిల్లా 89 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ట్రెజరర్ డీవీడీ భాస్కర్‌లు అభినందించారు.

ప్రతి నీటిబొట్టు ఒడిసి పట్టి..

- విజయవంతంగా జలశక్తి అభియాన్
- ఈ ఏడాది రూ.60.58 కోట్ల వ్యయంతో 4,804 పనుల పురోగతి
- 2023లో రికార్డు స్థాయి పనులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



జలశక్తి అభియాన్‌పై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ సృజన, అధికారులు

విజయవాడ లీగల్, జూలై 15 : నీటి సంరక్షణ, పారుదల సామర్థ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లాలో చేపడుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, సమన్వయ అధికారి జి.సృజన అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జలశక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో పూర్తయిన, చేపడుతున్న పనుల పురోగతిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ డైరక్టర్, జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి బి.మాదవరావు, 'సి' ఎస్ఆర్ శాస్త్రవేత్త రేష్మా ఎస్. రామన్ పిళ్లైకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టి కేంద్ర ప్రభుత్వ నీటి సంరక్షణ నీటి పారుదల సామర్థ్యాన్ని పెంచే జలశక్తి అభియాన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని రెండు దశల్లో చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో తొలిసారిగా జలశక్తి అభియాన్ 2019 జూలై నుంచి అక్టోబరు వరకు మొదటి దశ, రెండవ దశలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్, జలశక్తి వనరులు, అటవీ, వ్యవసాయ, ఉద్యాన, ఆర్‌డబ్ల్యుఎస్, గ్రౌండ్‌వాటర్ తదితర శాఖల సమన్వయంతో జల సంరక్షణ, వర్షపునీటి పెంపుదలకు ఫార్మపాండ్ చెక్‌డ్యాం పనుల్లో భాగంగా చిన్న, సన్నకారు రైతుల పొలంలో పంట కుంటలు, ఊట కుంటల తవ్వకం, నదీ పరీవాహక ప్రాంతాల్లో చెక్‌డ్యాం నిర్మాణం, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ సాంప్రదాయ నీటి వనరులు/చెరువుల పునరుద్ధరణలో చెరువులు పూడిక తీయడం, గట్లపై మొక్కల పెంపకం, కాలువల పూడిక తీయడం, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వాటర్ షెడ్ల అభివృద్ధి సమగ్ర అటవీకరణలో పనులు చేపట్టి పూర్తిచేయడం జరిగిందన్నారు. చెరువుల్లో పూడికతీత, గట్ల వెంబడి మొక్కలు నాటడం, ఆహ్లాదకర వాతావరణం కల్పించడం వంటి లక్ష్యంతో చేపట్టిన అమృత్ సరోవర్ కార్యక్రమంలో లక్ష్యానికి మించి విజయవంతంగా పూర్తిచేశామన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయిలో సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా చేసేలా చర్యలు తీసుకొన్నామన్నారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్, మ్యాపింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ ఏడాది వర్షాకాల రుతుపవన సీజన్‌లో జలశక్తి అభియాన్ ద్వారా, అమృత్ సరోవర్ ద్వారా మొత్తంగా 4,804 పనులను రూ.60.50 కోట్ల వ్యయంతో చేపట్టామని, ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని ప్రగతిలో వున్నామని కలెక్టర్ తెలిపారు. జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి బి.మాధవరావు మాట్లాడుతూ, జిల్లాలో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్, మ్యాపింగ్ నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 'సి' ఎస్ఆర్ శాస్త్రవేత్త రేస్మా ఎస్ రామన్ పిళ్లై మాట్లాడుతూ, జలశక్తి అభియాన్‌లో పంచాయతీ భూములు, నిరుపయోగ భూములలో రీచార్జి నిర్మాణాలను చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం జలశక్తి అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో భూగర్భ జల శాఖ జిల్లా అధికారి నాగరాజు, డ్వామా పీడీ జె.సునీత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీపీఓ శివప్రసాద్ యాదవ్, ఎస్‌సి ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ డీవీ రమణ, గ్రౌండ్ వాటర్ డీడీ నాగరాజా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

- ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సృజన, జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

కృష్ణలంక, జూలై 15 : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారులు ప్రజలకు జవాబుదారులుగా వ్యవహరించినప్పుడే లక్ష్యాలు సాధించగలుగుతామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా సోమవారం కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విధుల నిర్వహణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమన్నారు. ఉద్యోగులు, అధికారులకు ప్రభుత్వం సెలవులు వినియోగించుకోవడంలో నిర్దిష్టమైన నిబంధనలు ఉంటాయన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెడితే అనుమతించబోమన్నారు. విధి నిర్వహణలో అధికారుల పనితీరు ప్రభావం కిందిస్థాయి సిబ్బందిపై కూడా పడుతుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి శాఖపై ప్రత్యేక దృష్టి పెడతానని, లక్ష్యసాధనలో జాప్యాన్ని గుర్తిస్తే చర్యలకు వెనుకాడనన్నారు. వార్తా పత్రికల్లో వచ్చే సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించి అదేరోజు వివరణ నివేదికను అందచేయడంతో పాటు పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలకు నిర్దిష్ట గడువులోగా శాశ్వత పరిష్కారం చూపి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ టీఈఎం రాజు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఈఓ వెంకట సుబ్బారావు, వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణెమ్మ, జిల్లా క్షయవ్యాధి కంట్రోల్ అధికారిణి ఉషారాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ప్రియాంక, ఉద్యాన అధికారి బాలాజీకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ, సర్వశిక్ష అభియాన్ ఉమామహేశ్వరరావు, డీఎపీఆర్ఓ యు.సురేంద్రనాథ్, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- కృష్ణా కలెక్టర్ బాలాజీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారం చూపుతామని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల సమస్యలను విని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత వారం ఉద్యోగుల సమస్యలపై 64అర్జీలురాగా, వాటిలో 46 పరిష్కరించామన్నారు. ప్రస్తుతం 35అర్జీలు వచ్చాయని, వాటిని జిల్లా స్థాయి అధికారులు పరిశీలనచేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి : జేసీ

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజలనుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నిర్ణీత సమయంలోగా అధికారులు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, జెడ్పీఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎం అండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఎస్‌వో పార్వతి, జిల్లా సరఫరాలసంస్థ మేనేజర్ టి.సతీష్, డీఈవో తాహెరాసుల్తానా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నేకు మంత్రులు, నేతల నివాళి



గొల్లపూడి, జూలై 15 : గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ నేత అన్నే రామకృష్ణ (ఓటర్ రాము)కు టీడీపీ ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. గొల్లపూడిలో ఎస్.ఎస్.ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉంచిన ఆయన పార్థివ దేహంపై మంత్రి కొల్లు రవీంద్ర, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్, వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌లు టీడీపీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొని రాముకు జోహార్లు అర్పించారు.

గోనెసంచుల డబ్బులు ఇప్పించండి

- కలెక్టర్‌కు డీలర్ల అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

కృష్ణలంక, జూలై 15 : వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించి రేషన్ డీలర్ల నుంచి తీసుకున్న 5 లక్షల ఖాళీ గోనె సంచుల తాలూకా బకాయిలు రూ.1 కోటి వెంటనే ఇప్పించాలని కోరుతూ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శేషు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సృజనకు రేషన్ డీలర్లు వినతి పత్రం సమర్పించారు. చంద్రబాబు హయాంలో డీలర్లకు ఇస్తున్న కమీషన్‌తో పాటు గోనెసంచులు కూడా డీలర్లకే చెందుతాయని ఇచ్చిన జీవోను వైసీపీ ప్రభుత్వం రాగానే జీరో డెలివరీ పేరుతో తుంగలో తొక్కిందన్నారు. జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్లలో వున్న కాటాను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శిశువు అపహరణ కేసులో మహిళ అరెస్ట్

- గంటల వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు



మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో ఐదురోజుల శిశువును అపహరించిన కేసులో నిందితురాలు తమ్మిశెట్టి లక్ష్మిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో శిశువు అపహరణకు గురైన గంటల వ్యవధిలోనే నిందితురాలిని పోలీసులు పట్టుకున్నట్టు తెలిపారు. ఇంగ్లీష్‌పాలెంకు చెందిన తమ్మిశెట్టి లక్ష్మి శిశువును అపహరించి యాచకవృత్తిని ఎంచుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్టుగా తమ విచారణలో వెల్లడైందన్నారు. కేసులో మరిన్ని వివరాలు రాబడుతున్నామని తెలిపారు. ఈనెల 9వతేదీన ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ శివారు సూరపనేనిపాలెంకు చెందిన రాచూరి స్వరూపరాణి ప్రసవం నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో చేరింది. ఆమెకు ఆపరేషన్ జరగడంతో 9రోజులపాటు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. 13వతేదీ అర్ధరాత్రి స్వరూపరాణి, ఆమెతల్లి గ్రేసమ్మ 2గంటల సమయంలో లేచి చూడగా శిశువు కనిపించలేదు. పోలీసులు ఫిర్యాదు అందడంతో ఆసుపత్రి, మచిలీపట్నంలోని పలుప్రాంతాలలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలన చేయగా, శిశువును తమ్మిశెట్టిలక్ష్మి తీసుకువెళ్లినట్టుగా గుర్తించామన్నారు. లక్ష్మిని ఆమె ఇంటివద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. శిశువును తల్లికి అప్పగించడం జరిగిందన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

నున్నలో కేంద్ర బృందం పర్యటన

విజయవాడ లీగల్ : జలసంరక్షణ పథకం అమలుపై జలశక్తి అభియాన్ కేంద్ర బృందం నున్నలో పర్యటించింది. నోడల్ అధికారి మాధవరావు, సైంటిస్టు రేష్మ నున్న, పాతపాడులో ఫారం పాండ్‌లు, చెట్ల పెంపకం, రింగ్ ట్రెంచ్‌లు, రీచార్జ్ పిట్‌లు తదితర పనులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఎన్టీఆర్ జిల్లాలో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా అధికారులను అభినందించారు. ఎన్టీఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం కేంద్ర బృందం సోమవారం ఎన్టీఆర్ జిల్లాకు వచ్చింది. తొలిరోజు విజయవాడ రూరల్ మండలం నున్న, పాతపాడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భూగర్భ జలాలు, నీటి సంరక్షణ కోసం మామిడి తోటలో తవ్విన ఫారంపాండ్, రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించారు. క్షేత్ర పర్యటన సందర్భంగా కేంద్ర బృందం రైతులు, లబ్దిదారులతో మాట్లాడి పథకాలపై అభిప్రాయాన్ని సేకరించింది. అలాగే పథకం అమలు, వినియోగంపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరక్టర్ జె.సునీత, జిల్లా పంచాయతీ అధికారి శివప్రసాద్ యాదవ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండింగ్ ఇంజినీర్ రమణతో కలిసి బృంద సభ్యులు కాలువ ప్లాంటేషన్, తాగునీటిని పరిశీలించారు. క్షేత్ర పర్యటనకు ముందు బృందం సభ్యులు జిల్లా కలెక్టర్, ప్రోగ్రాం జిల్లా కో-ఆర్డినేటర్ జి.సృజనతో సమావేశం నిర్వహించారు.



నున్నలో పర్యటించిన జల అభియాన్ కేంద్ర బృందం




రాజుపేటలో ఆధార్ ఆన్‌లైన్ చేస్తున్న సభ్యులు

ఆన్‌లైన్ రుణాల పేరుతో నగదు వసూళ్లు!

తిరువూరు, జూలై 15 : మెప్మా సభ్యులు ఆధార్‌కార్డులు ఆన్‌లైన్ చేసుకుంటే రుణం పొందవచ్చని, మహిళల్ని నమ్మించి నగదు వసూలు చేసిన వారిని మునిసిపల్ కమిషనర్ సూచన మేరకు పోలీసులు స్టేషన్‌కు తరలించారు. సోమవారం పట్టణ పరిధిలోని మెప్మాగ్రూపులకు చెందిన కొందరు లీడర్లు, చేతివృత్తుల వారికి రుణాలు ఇస్తారని, మీ ఆధార్ కార్డు ఆన్‌లైన్ చేసేందుకు విజయవాడ నుంచి సిబ్బంది వచ్చారని, సభ్యులు రావల్సిందిగా ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి ఎక్కడి రావాలో సూచించారు. విజయవాడ నుంచి వచ్చిన వ్యక్తులతో స్థానిక మెప్మా సిబ్బంది ఉండటం గమనార్హం. ఆన్‌లైన్ చేసేందుకు ప్రతి సభ్యురాలు రూ.150లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సుమారు 400 మంది సభ్యుల నుంచి రూ.150 చొప్పున వసూలు చేసినట్టు సమాచారం. రాజుపేట ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చిన కొందరు సభ్యులు మీరు ఎవరు.. ఆన్‌లైన్ చేసేందుకు నగదు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించడంతో మెప్మా గ్రూపుల వివో ఒకరు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకంలో చేతివృత్తుల వారికి రుణాలు ఇచ్చేందుకు, ఆధార్‌కార్డు ఆన్‌లైన్ చేయిస్తున్నట్టు వివరించింది. నగదు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించడంతో, మెప్మా సిబ్బందికి, సభ్యులకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ లోవరాజును వివరణ కోరగా, తనదృష్టికి ఈ విషయం వచ్చిందని, అనుమతులు ఉన్నాయని వారు చెబుతున్నా.. ఉన్నాతాధికారుల నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో విషయం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లామని, విజయవాడ నుంచి వచ్చిన వారినుంచి సమాచారం సేకరిస్తున్నారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



జగ్గయ్యపేట రూరల్, జూలై 15 : జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలయని వాహనం ఢీకొన్న ఘటనలో మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన నల్లమట్ల గోపి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిల్లకల్లు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి విచారణ చేస్తున్నారు. మృతుడికి భార్య సింధు, మూడేళ్ల రిషిత, ఐదు నెలల సంగీత ఉన్నట్టు బంధువులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. టీడీపీకి సానుభూతిపరుడిగా ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న గోపి ఆదాయం లేక ఆటోఫైనాన్స్ కట్టకపోవటంతో ఇటీవల యాజమాన్యం ఆటోను తీసుకెళ్లింది. కుటుంబాన్ని పోషించేందుకు భవన నిర్మాణ కార్మికునిగా పనులకు వెళ్తున్నాడని బంధువులు తెలిపారు. గోపి మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

కేఎల్ రావు స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలి

కంకిపాడు, జూలై 15 : అపర భగీరథుడు, ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు (కె.ఎల్.రావు) పేరు మీద కంకిపాడులో స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలని కే.ఎల్.రావు విజ్ఞాన వేదిక కన్వీనర్ సుబ్బారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణరెడ్డి భవన్‌లో కే.ఎల్.రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, కంకిపాడులో పుట్టి, పెరిగి, ఇక్కడే విద్యాభ్యాసం చేసి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప ఇంజనీర్‌గా కే.ఎల్ రావు గుర్తింపు పొందారన్నారు. పార్లమెంటేరియన్‌గా, కేంద్రమంత్రిగా అనేక పదవులు అధిరోహించారని కొనియాడారు. అటువంటి మహనీయుడికి తాను పుట్టిన గ్రామంలో ఎటువంటి గుర్తింపు లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాంచారయ్య, పంచకర్ల రంగారావు, తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో చోరీ

పెనమలూరు, జూలై 15 : మండలంలోని పెదపులిపాకలో ఒక ఇంట్లో జరిగిన చోరీపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. పెదపులిపాకకు చెందిన లంకా చంద్రశేఖరరావు దంపతులు ఈ నెల 6న తిరుపతి వెళ్లారు. 11న పక్కింటి పనిమనిషి ఫోన్ చేసి మీఇంటి తలుపులు తెరచి ఉన్నాయి అని చెప్పడంతో వెంటనే తిరుపతి నుంచి తిరిగి వచ్చారు. వచ్చి చూడగా ఇంట్లోని ఏభైవేల నగదు, షుమారు పది కాసుల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గమనించిన చంద్రశేఖరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

శంకరబాబుకు వైవీబీ పరామర్శ



శంకరబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

పెనమలూరు, జూలై 15 : ఇటీవల డయేరియాతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబును టీడీపీ నాయకులు వైవీబీ రాజేంద్రప్రసాద్ సోమవారం పరామర్శించారు. అనారోగ్య పరిస్థితికి కారణాలను అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఉయ్యూరు టీడీపీ నాయకులు ఉన్నారు.

19న మండల సమావేశం

హనుమాన్‌జంక్షన్,జూలై 15 : బాపులపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 19 తేదీన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పరిష్కార వేదికకు 306 అర్జీలు

హనుమాన్‌జంక్షన్, జూలై 15 : గన్నవరంలో సోమవారం జిల్లా కలెక్టర్ బాలాజీ సమక్షంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాపులపాడు మండలానికి సంబంధించి 306 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఏ. శ్రీనివాస్ తెలిపారు. అందులో 62 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించి మల్లవల్లి ఏపీఐఐసీ భూ నిర్వాసితుల అర్జీలు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. మిగిలిన అర్జీలు ఇతర శాఖలకు సంబంధించినవి అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు.

కార్మెల్‌మాత తేరు ఊరేగింపు

పెనమలూరు, జూలై 15 : కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల సందర్భంగా చివరి రోజున కామయ్యతోపు ప్రధాన రోడ్డులో తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఫాదర్ సలివేంద్ర శౌరి ప్రారంభించారు. కార్యక్రమానికి గంగూరు, సాలిపేట, కానూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఫాదర్ తాళ్లూరి ఆనంద్, దేవదానం, రత్నరాజు, సిటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, రెవరెండ్ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

గన్నవరం, జూలై 15 : యోగాతోనే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కలుగు తుందని ప్రిన్సిపాల్ డి. మాధవిలత అన్నారు. స్థానిక శ్రీమల్లికార్జున ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఇనిస్టిట్యూట్ అండ్ యోగా థెరపీ మిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న యోగా శిక్షణ సోమవారంతో ముగిసింది. యోగా థెరపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ రెడ్డి విద్యార్థులకు ప్రాణయామం, ధ్యాన ప్రక్రియ ద్వారా శారీరక, మానసిక రుగ్మతల నియంత్రణపై అవగాహన కల్పించారు. శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల డైరెక్టర్ నక్కిన చినవెంకట రాయుడు, పీఎడ్ ప్రిన్సిపాల్ పిచ్చియ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి లయన్స్ చేయూత

నోటుపుస్తకాలు, సామగ్రి అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 15 : లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ ద్వారా విద్యాభివృద్ధికి చేయూత అందిస్తున్నామని అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు అన్నారు. ఓగిరాలలోని రెండు ఎంపీ యూపీ స్కూళ్లలోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ హను మాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ నాయ కుడు మేడికొండ బుచ్చిబాపయ్య సహకారంతో 82మంది విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు, పెన్నులు, తది తర విద్యా సామాగ్రిని సర్పంచ్ కగ్గా పద్మావతిడేవిడ్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు ఎన్ సత్యవేంకటేశ్వరశర్మ, గూడపాటి రత్నశేఖర్, మాకినేని శ్రీనివాసరావు, జిల్లా క్యాబినెట్ సభ్యుడు అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, పర్వతనేని పద్మజ కుమారి, విజయ రాజేశ్వరి, సత్యవతి, ఆశాలత పాల్గొన్నారు.



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ అధ్యక్షుడు నారాయణరావు, దాత మేడికొండ బుచ్చిబాపయ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 15 : వర్షాల కారణంగా దోమలు, ఇతర సూక్ష్మ క్రిముల వల్ల ప్రబలే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ అధికారులను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశించారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో మూడు మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పీఎస్‌లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా దోమలు ప్రబలే ప్రమాదం ఉందని, దోమలు, క్రిముల నిర్మూలనకు ప్రతి వీధిలో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండ కుండా శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రింది స్థాయి సిబ్బంది నుంచి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఇంటి పన్నులను ప్రభుత్వ నిబంధనల మేరకు విధించాలని కోరారు. గ్రామాల్లో రోడ్లను, ఇతర ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టాలని ఆదేశించారు. కంకిపాడు మండలం దావులూరులోని అసంపూర్తి పనులు, కుందేరు వంతెనకు అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

బోర్‌వెల్ ప్రారంభం

తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురు పరిధి ఇందిరానగర్1లో సోమవారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్థానికుల నీటి అవసరాల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ప్రారంభించారు. ఐదు లక్షల మునిసిపల్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ ప్రారంభ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తాతపూడి గణేష్, అనంతనేని చంద్రశేఖరాజాద్, వెలగపూడి బాబూరావు, మొక్కపాటి శ్రీనివాస్, ముప్పవరపు నారాయణ, ఇబ్రహీం, సింగం సుబ్రహ్మణ్యం, సంపర శేఖర్, తమ్ము అశోక్, ధనేకుల భార్గవ్, శొంఠి శివరాంప్రసాద్, వీరంకి కుటుంబరావు, షకీలా, షాహీనా, పాదాల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

● యనమలకుదురులోని ఒక నిరుపేద వ్యక్తికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్థానిక నాయకులు అనంతనేని ఆజాద్, ఇబ్రహీంల సహకారం మేరకు జీవనోపాధికి టీ బండిని వితరణగా అందించారు. ఆజాద్, ఇబ్రహీంలను ఎమ్మెల్యే అభినందించారు.

ఆరుగొలను చానల్ పూడికతీత

● రైతులే స్వచ్ఛందంగా చేపట్టిన పనులు



పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న రైతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 15 : కలిసికట్టుగా పనిచేస్తే ప్రభుత్వానికి భారం కాకుండానే పనులు చేసుకోవచ్చని ఆరుగొలను రైతులు చేసి చూపారు. ఆరుగొలనుతో పాటు తిప్పనగుంట, కానుమోలు గ్రామాల పొలాలకు సాగునీరందించే ఆరుగొలను చానల్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ముళ్లచెట్లు, చెత్తతో పూడిపోయింది. ఆరుగొలను గ్రామానికి చెందిన రైతులు ఎకరానికి రూ.400 చొప్పున సమీకరించి పూడికతీత పనులను సోమవారం మొదలుపెట్టారు. ఏలూరు కాలువకు సాగునీరు వస్తోందని జలవనరులశాఖ అధికారులను సంప్రదించగా పనులు చేయకుండా తాత్సారం చేస్తుండడంతో తప్పని పరిస్థితుల్లో రైతులందరం కలిసి పూడిక తీసుకుంటున్నామని తుమ్మల బ్రహ్మజీ, పెదర్ల యామినీ ప్రసాద్, యజ్ఞం, తదితరులు వివరించారు. పనులను తుమ్మల విష్ణుకుమార్, గండి వెంకటకృష్ణారావు, మూల్పూరి అనిల్, ఈడుపుగంటి బాలరాజు, తదితర రైతులు పర్యవేక్షిస్తున్నారు.

హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి రక్షణ

మచిలీపట్నం టౌన్, జూలై 15 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు వద్ద హెల్మెట్ ధారణపై ర్యాలీని అరుణ సారిక ప్రారంభించి మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య, బార్ అధ్యక్షుడు అశోక్ కుమార్, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

పెనమలూరు, జూలై 15 : పెనమలూరు మండలంలో ముమ్మరంగా వరినాట్లు జరుగుతున్నాయని, సోమవారం నాటికి 2511 హెక్టార్లలో వరి, 40 హెక్టార్లలో చెరుకు సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి శైలజ తెలిపారు. ఎంటీయూ 1318రకం వరిని 70శాతం, 1061 రకాన్ని 25 శాతం సాగు చేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్ కూలీలతో నాట్లు వేసినచో ఎకరానికి ఒకసెంటు నారుమడి సరిపోతుందని, గాలి, వెలుతురు బాగా ఉండి పురుగులు తెగుళ్ల ఎక్కువగా రాకుండా ఉంటాయని రైతులకు ఆమె సూచించారు.

ప్రకృతి సాగుతోనే ఆరోగ్య పరిరక్షణ



ఆరుగొలను హైస్కూల్‌లో సూర్యమండల నమూనాను తిలకిస్తున్న బీహార్‌కు చెందిన ప్రత్యేక బృందం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 15 : సహజసిద్ధంగా లభించే వనరులను ఉపయోగించుకుని ప్రకృతి సాగు చేయడం వల్ల ఆరోగ్యకర సమాజంతో పాటు హానికర రసాయనాల వల్ల కలిగే కాలుష్యాన్ని నివారించవచ్చని ప్రకృతి సాగు అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆరుగొలను, కానుమోలు గ్రామాల పరిధిలో జరుగుతున్న ప్రకృతి సాగు విధానాన్ని సోమవారం బిహార్‌కు చెందిన ప్రత్యేక బృంద సభ్యులతో కలిసి పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ముందస్తు సన్నాహకంగా 32రకాల ధాన్యాలతో పలువురు రైతులు చేసిన ప్రకృతి సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆరుగొలను ఐసీఆర్టీ చలం ప్రసాద్ పొలాన్ని, హైస్కూల్‌లో సూర్యమండల నమూనాతో సాగు చేసిన పోషకాల పెరేడ్ (న్యూట్రీషన్ గార్డెన్) పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం పార్థసారథి, అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూమిని ఆన్‌లైన్ చేయాలి

కలెక్టర్ బాలాజీకి సీపీఎం నాయకుల వినతి



సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉంగుటూరు, జూలై 15 : పేదలకు పంపిణీ చేసిన అస్సైన్‌మెంట్ భూమిని ఏళ్ల గడుస్తున్నా అధికారులు ఆన్‌లైన్ చేయటంలేదని ఆరోపిస్తూ ఎలుకపాడు గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో గన్నవరం మండలం చినఅవుటపల్లిలో జరిగిన నియోజకవర్గస్థాయి ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ డీకే బాలాజీ ముందు తమ గోడును వినిపించారు. అనంతరం సంబంధిత వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.దేవదాసు, సీహెచ్ బాబూరావు, పి.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మండలంలో నెలకొన్న పలు అపరిష్కృత సమస్యలపై దృష్టిసారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం చినఅవుటపల్లిలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు టీవీ లక్ష్మణస్వామి మాట్లాడుతూ, మండలంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని, ప్రధానంగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో డెక్క, తూడు మేటవేసుకుపోయి కాలువ చివరి పొలాలకు సాగునీరందని పరిస్థితి నెలకొందన్నారు. ఉంగుటూరు-లంకపల్లి గ్రామాలమధ్య బుడమేరుపై చేపట్టిన వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని, బుడమేరు ఆధునీకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. మండలంలో ప్రభుత్వ, పోరంబోకు మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని, గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని, గత ఏడాది తుఫాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు పంటనష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, పి.రాజారావు, సలీం, ఆంజనేయులు, ఏసుదాసు, తాతబ్బాయి, సాంబశివరావు, షేక్ ఎం. గాలాబ్, కె.సీతారామరాజు, జె.జగన్, ఎస్.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూసివేత దిశగా ఉయ్యూరు డిపో?

● ఇతర డిపోలకు తరలిస్తున్న బస్సులు
● కాలం చెల్లిన బస్సులతో కాలక్షేపం
● వేధిస్తున్న టోల్‌గేట్ సమస్య



ఉయ్యూరు ఆర్టీసీ డిపో

ఉయ్యూరు. జూలై 15 : ఉయ్యూరు ఆర్టీసీ డిపో మూసివేత దిశగా అధికారులు స్పీడుగా స్టీరింగ్ తిప్పుతున్నారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఉయ్యూరులో బస్టాండ్, బస్సు డిపోకు శంకుస్థాపన చేశారు. 1991లో డిపో నుంచి బస్సుల రాకపోకలు ప్రారంభమైనప్పటి నుంచి పొరుగు మండలాల తో పాటు జిల్లా, పొరుగు గ్రామాలకు బస్సులు నడిపి ప్రయాణికులకు చక్కటి రవాణా సౌకర్యం కల్పించారు. తదుపరి పరిస్థితుల్లో డిపోకు నష్టాలు వస్తున్నాయని 2006లో ఉయ్యూరు, గన్నవరం డిపోలు మూసివేసి 2010లో తిరిగి డిపోను ప్రారం భించారు. మచిలీపట్నం, అవని గడ్డ, భీమవరంతో పాటు పలు ప్రాంతాలకు బస్సులు నడిపి డిపోను లాభాల బాటలో తీసుకు వచ్చారు. తరువాత డిపో పట్ల ఆర్టీసీ అధికారులు చిన్న చూపు చూసి లాంగ్ రూట్ బస్సులు ఇతర డిపోలకు కేటాయించి ఒకటి రెండు పల్లెవెలుగు, హైదరాబాద్ బస్సులు మినహా మిగిలిన వన్నీ 222 నంబరు సిటీ బస్సులుగా ఉంచి సిటీ బస్‌డిపోగా తయారు చేశారు. కొన్ని బస్సులు గుడివాడ, విజయవాడ డిపోలకు తరలించారు. దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీలు లేకుండా శెలవులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

టోల్‌గేట్ సమస్య కూడా డిపోను నష్టాల బాటలోకి నెడుతుంది. 222 నంబరుతో కాళేశ్వరరావు మార్కెట్‌కు వెళ్లే ఒక్కో బస్సు రోజుకు రూ. 1000 పైన టోల్‌గేట్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. రద్దీగా ఉండే సమయంలో తప్ప మిగిలిన సమయంలో ప్రయాణికులు లేక టోల్‌గేట్‌కు కట్టే డబ్బు కూడా రాకపోవడంతో డిపో చేతి నుంచి కట్టాల్సివస్తుంది. బస్సులు లేక ఇప్పటికే కంకిపాడు - గన్నవరం, ఉయ్యూరు- గుడివాడ, ఉయ్యూరు- ద్వారకా తిరుమల, కుందేరు వెళ్లే సర్వీసులు తగ్గించి వేశారు.

డిపో మూసివేత అపోహ..

డిపో మూసివేతపై వస్తున్న వార్తలపై ఆంధ్రజ్యోతి డీఎంను వివరణ కోరగా.. మూసివేత అనేది అపోహ మాత్రమే అని, కొత్త సర్వీసులు వస్తున్నాయని, అదే విధంగా ఇతర డిపోలకు వెళ్లిన బస్సులు కూడా త్వరలోనే వస్తాయని డీఎం కెవీఎస్ ప్రసాద్ తెలిపారు.

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ తిరపతమ్మ, గోపయ్య స్వామి

గన్నవరం, జూలై 15 : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరపతమ్మ ఆలయంలో వరశిద్ధి ప్రదాయిని శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా ముగి సాయి. గత పది రోజులుగా పూజలు అందుకుంటున్న అమ్మవారికి సోమవారం విశేష పూజలు నిర్వహిం చారు. ప్రతిరోజు సాయం త్రం లలిత సహస్రనామ పారా యణం, వారాహి అష్టోత్తర లక్ష్మీ పూజలు జరిపారు. మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుంచి రక్షణ



హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి అరుణసారిక

మచిలీపట్నం టౌన్, జూలై 15 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కోర్టు వద్ద హెల్మెట్ ధారణపై ర్యాలీని అరుణ సారిక ప్రారంభించి మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య, బార్ అధ్యక్షుడు అశోక్ కుమార్, న్యాయవాద గుమాస్తాల సంఘ నాయకులు పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఆచంట సునీత

మహిళల రక్షణకు ప్రాధాన్యం : సునీత

మోపిదేవి : మహిళల రక్షణకు కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని టీడీపీ రాష్ట్ర డ్వాక్రా, అంగన్‌వాడీ మహిళా సాధికార సమితి అధ్యక్షురాలు ఆచంట సునీత తెలిపారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సోమవారం ఆమె దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం స్వామివారి ప్రసాదాలు ఆమెకు అందజేశారు. టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వైసీపీ పాలనలో వైఫల్యంతో ధ్వంసమైన వ్యవస్థను సీఎం చంద్రబాబు గాడీలో పెడుతున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, రావి రత్నగిరి, నందిగం శంకర్, కనకయ్య, బల్లా సీతారామ ప్రసాద్, గొరిపర్తి సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాల్లో నీటిని తోడిస్తున్న మున్సిపల్ అధికారులు

ముంపు ప్రాంతాల్లో మురుగు తొలగింపు చర్యలు

మచిలీపట్నం టౌన్ : భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. ముంపునకుగురైన సుందరయ్యనగర్, రైలుపేట శివారు, తదితర ప్రాతాల్లో మోటార్లు పెట్టి నీటిని తోడిస్తున్నారు. బందరు బస్టాండులో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా మోటార్లతో నీటిని తోడిస్తున్నారు. మేజర్ డ్రెయిన్లు, మైనర్ డ్రెయిన్లతో అనుసంధానం కాకపోవడం వల్ల కన్యకాపరమేశ్వరి దేవస్థానం ముందు, ప్రధాన పోస్టాఫీసు ముందు నీరు నిలచి ఉంటోంది.

రక్షిత నీటి పథకాలకు నీరు విడుదల

నాగాయలంక : అధికారులు నాగాయలంక సౌత్ చానల్‌కి పట్టిసీమ నీరు విడుదల చేయగా, సోమవారం వక్కపట్లవారిపాలెం రెగ్యులేటర్ నుంచి నాగాయలంక సెంట్రల్ కాలువకు తాగునీటి కోసం విడుదల చేశారు. వక్కపట్లవారిపాలెం, భావదేవరపల్లిలోని సెంట్రల్ కాలువ నుంచి తాగునీరు కమ్మనమోలులోని సామూహిక రక్షిత మం చినీటి పథకం చెరువులోకి వెళ్తుంది. ఆ చెరువు నిండాక నాగాయలంక నుంచి గుల్లలమోద వరకు ఉన్న సౌత్ ఛానల్‌కు నీరు విడుదల చేసి మిగిలిన గ్రామాలకు తాగు నీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



ఎమ్మెల్యే మండలి చొరవతో వ్యర్థాల తొలగింపు

అవనిగడ్డ : అవనిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని కోటగిరిలంకలో ఎన్నో ఏళ్లుగా సిమెంట్ రోడ్డు మీద పెంటపోగు వేయటంతో ఆర్‌సీఎం చర్చి ప్రధాన రోడ్డు మీద నిత్యం మురుగు పారుతుండేది. దీనివల్ల చర్చికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది.. పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఎక్స్‌కవేటర్‌తో పెంటపోగును, రోడ్డు మీద ఉన్న మురుగును తొలగించారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కర్రా సుధాకర్, కంచర్ల ఆనంద్ బాబు, దిడ్ల వెంకటేష్ పర్యవేక్షించారు.

బుసక, ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు చేపట్టరేం

అవనిగడ్డ : నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలన అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు దివిసీమలో జరుగుతున్న ఇసుక, బుసక, మట్టి అక్రమరవాణా, జూదం నివారణకు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇసుక, బుసక, మట్టి అక్రమ రవాణా పట్టపగలే యథేచ్ఛగా సాగుతున్నాయని, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో పేకాట, కోడిపందాలు జరుగుతున్నా బుద్ధప్రసాద్ ఎందుకు స్పందించటం లేదని ఆయన ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు కోసం పరితపించి కాలువలు పూర్తి చేసిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, నలుకుర్తి పృథ్వీరాజ్, షేక్ నజీర్ బాషా, చింతలపూడి బాలభాస్కరరావు తదిరతులు పాల్గొన్నారు.



కూచిపూడిలో ఊపందుకున్న వరినాట్లు

కూచిపూడి : విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. 11,250 హెక్టార్లలో ఈ ఏడాది వరి నాట్లు వేయాల్సి ఉంది. పనులు ఒక్కసారిగా ప్రారంభం కావటంతో కూలీలకు గిరాకీ ఏర్పడింది. బెంగాల్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి రైతులు కూలీలను తీసుకువచ్చారు. మొవ్వ, కూచిపూడి, భట్ల పెనుమర్రు, కారకంపాడు, పెడసనగల్లు గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు.. కాజ, కోసూరుతోపాటు పలు గ్రామాల్లోని రైతులు వెద పద్ధతిలో సాగు చేశారు.. డ్రెయిన్లు మరమ్మతులు చేయించకపోవటం, పంట కాలువలు పూడిక తీత పనులు చేపట్టకపోవటం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైసీపీ వార్డు సభ్యులు తొమ్మిది మంది రాజీనామా

నందివాడ (జనార్ధనపురం) : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ ఓటమిని తట్టుకోలేక వైసీపీ జనార్ధనపురం పంచాయతీ వార్డు మెంబర్లు తొమ్మిది మంది తమ పదవులకు రాజీనామా చేశారు. ఎంపీడీవో యు.ఇఎస్.నాగేశ్వరరావుకు సోమవారం స్వయంగా రాజీనామా పత్రాలను అందజేశారు. కొండపల్లి నాగమల్లేశ్వరి (1వ వార్డు), బత్తు నాగలక్ష్మి (4వ వార్డు), దొరసాల సుజాత (5వ వార్డు), బోనం శివాజీ (6వ వార్డు), నక్క బాలకోటమ్మ (7వ వార్డు), ఎనికేపల్లి దుర్గారావు (8వ వార్డు), సోమతోటి మేరమ్మ (9వ వార్డు), గోటు శ్యాంబాబు (10వ వార్డు), రావూరి దాసులు (12వ వార్డు) రాజీనామా రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.



మున్సిపల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గూడూరు పీహెచ్‌సీలో మందుల విషయమై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కాగిత

అధికారులు అప్రమత్తం కావాలి

• పారిశుధ్యం మెరుగుపర్చాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల • సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి : ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గుడివాడ, జూలై 15 : అధికారులు అప్రమత్తమై సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రాము ఆదేశించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ సోమవారం అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. డెంగ్యూ బారినపడి తన తల్లి చికిత్స పొందుతున్నారని, మరొకరు ఈ విధంగా బాధపడకూడదనే తన ప్రయత్నమన్నారు. దోమలు, వ్యాధి కార క్రిముల నిర్మూలనకు క్రమం తప్పకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శానిటేషన్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. శానిటేషన్ సిబ్బంది, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. టిడ్కో, జగనన్న కాలనీల్లో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి మరో 30 మంది కార్మికులను నియమించేందుకు ప్రతిపాదనలు పురపాలక శాఖకు పంపడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ కమీషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ డి.టి.వి కృష్ణారావు, మున్సిపల్ డీఈ ప్రవీణ్, ఏఈలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతే ముఖ్యం

కోడూరు : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ సీజన్ మారినప్పుడల్లా క్రిములు మారతాయన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవటం, నీరు కలుషితం అవ్వటం జరుగుతాయన్నారు. నీటి నిల్వలు వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు, కామెర్లు, వాంతులు, విరోచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, బయట ఆహారానికి దూరంగా ఉండి ఇంటిలో తయారు చేసిన ఆహారాన్ని మ్రాతమే తీసుకోవాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

కనుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సూచనలు

పామర్రు : దగ్గు, జలుబు వంటి వాటిని అశ్రద్ధ చేయకుండా వైద్యుల వద్ద తప్పని సరిగా చికిత్స చేయించుకోవాలని కనుమూరు పీహెచ్‌సీ వైద్యులు టి.రాజేష్ పేర్కొన్నారు. వైద్యుల సూచనలు పాటించడంతో పాటు, వరుసగా అనారోగ్యానికి గురవుతున్నా వారు రక్త పరీక్షలు చేయించుకోవటం మంచిదన్నారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

వేడి పదార్థాలను మాత్రమే తినాలన్నారు. నిల్వ ఉంచిన పదార్థాలను ఇంటి పరిసరాల్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడి నీటిని కాచి చల్లార్చి తీసుకుంటే మంచిదన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు ఉత్పత్తి జరిగే రబ్బ రు టైర్లు, కొబ్బరి బొండాలను నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉంచాలి

పెడన : గూడూరు మండలం గూడూరు, మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలోని వైద్య సేవా విభాగాలను ఆయన పరిశీలించారు. సరిపడా మందులు రావడం లేదని, సెలైన్ సీసాలు అందుబాటులో లేవని తేలింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియచేసి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలితే చికిత్సకు అవసరమైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. కప్పలదొడ్డి, రామరాజుపాలెం సచివాలయాలతో పాటు గూడూరు పంచాయతీ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేశారు. గ్రామాలను ఏ రోజు కారోజు పరిశుభ్రం చేయాలని, వీధి దీపాలు వెలిగేలా చూడాలని గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. టీడీపీ నాయకులు పోతన స్వామి, గోపీ నాగబాబు, ఎన్ఏ బేగ్, అన్నం హరిరామకృష్ణ, కట్టా మునీశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు పంచకర్ల సురేష్, దాసరి ఉమా సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ శాఖ నిర్లక్ష్యం - రైతులకు శాపం

● తూడు తొలగింపులో మీనమేషాలు

● ముంపు బారిన వరి పొలాలు

గుడ్లవల్లేరు : డ్రెయినేజీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా తయారైంది. సకాలంలో డ్రెయినేజీ పూడిక తీయకపోవడం వల్ల మురుగుకిందకు పోక వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందానే డ్రెయినేజీ శాఖ వ్యవహరిస్తుండడం పరిపాటిగా మారింది. వేసవికాలం పూర్తయ్యే వరకూ చేతులు ముడుచుకొని కూర్చొని వర్షాలు వచ్చిన తర్వాత డ్రెయిన్ పూడికతీత పనులకు టెండర్లు పిలవడం పరిపాటయ్యింది. వర్షకాలంలో కాంట్రాక్టర్లు కూడా పూడికతీత నామ్‌కే వాస్తేగా చేస్తున్నారు. గుడ్లవల్లేరు, గూడూరు, పెడన మండలాలకు ప్రధాన మురుగు కాల్వ ఇదే. టెండరైతే ఖరారైంది కానీ కాంట్రాక్టు పొందిన వారు ఇంకా డిపాజిట్ చెల్లించ లేదని సమాచారం. దీంతో పని కూడా మొదలు పెట్టలేదు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తొలి వర్షాలకే డ్రెయిన్ పొంగి వడ్లమన్నాడులో వందలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయి. ఆదివారం సాయంత్రం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ లకు ఆప్రాంత రైతులు డ్రెయిన్ దుస్థితిని చూపించగా, బాలసౌరి వెంటనే డీఈతో ఫోన్‌లో మాట్లాడారు త్వరితగతిన పనులు చేయించాలని ఆదేశించారు. ఎంపీ చెప్పి 24 గంటలు అయినా ఇంత వరకూ స్పందించలేదు. ఇది ఒక్క వడ్లమన్నాడు డ్రెయిన్ పరిస్థితే కాదు మండలంలో చాలా డ్రెయిన్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది. అధికారుల్లోనే కాదు రైతాంగం లోనూ మార్పు వస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభించదు. పరుగులు పెట్టించే ప్రభుత్వం వచ్చినా అధికారుల తీరులో పెద్దగా మార్పు కన్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు మొదలు పెట్టకుంటే రాబోయే రెండు రోజుల్లో కురవనున్న వర్షాలకు మరింత ముంపు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వడ్లమన్నాడు డ్రెయిన్‌లో సకాలంలో తొలగించని తూడు

ఉయ్యూరు, పామర్రు ప్రభుత్వ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఉయ్యూరు : ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ఆన్‌లైన్ ప్రవేశాలను ఈనెల 20 వరకు పొడిగించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సిద్ధార్థ ఫౌండేషన్ స్కాలర్ షిప్స్ ప్రతి ఏటా అందిస్తున్నట్టు తెలిపారు. **పామర్రు :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల గడువు ఈనెల 20 వరకుపొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తెలిపారు.. విద్యార్థులు వెబ్ ఆప్షన్ ఇవ్వడం కోసం ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ఖరారు చేయడం జరిగిందన్నారు. 31 నుంచి సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. అడ్మిషన్ల కన్వీనర్ కెఆర్‌జి శేషకుమార్ మాట్లాడుతూ, కాలానికి అనుగుణంగా ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునికమైన సౌకర్యాలతో జిమ్, మూడు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన క్రీడా మైదానం కలిగి ఉన్నదన్నారు. పి.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు మురళి, రవి, ప్రభావతి సునీత పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన

కోడూరు : మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అధికారులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో శ్రీధర్ మాట్లాడుతూ పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చట్టం రూపొందించారన్నారు. ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఏవో, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

మీ కోసంలో ఒకే అర్జీ

కూచిపూడి : మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసంలో ఒకే అర్జీ దాఖలైనట్లు డిప్యూటీ తహసీల్దార్ కొడాలి శ్రీనివాసరావు తెలిపారు. నిడుమోలు గ్రామానికి చెందిన బొడ్డు వెంకటేశ్వరమ్మ భూవివాదానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని అర్జీ దాఖలు చేశారన్నారు.



బందరులో మహిషాసురమర్దని అమ్మవారికి..



నాగాయలంకలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి..

అమ్మవార్లకు ఆషాఢ సారె

మచిలీపట్నం టౌన్ : ఆషాఢ మాసం సందర్భంగా చమ్మనగిరిపేటలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మహిషాసురమర్ధని అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. సువాసినులు ఆషాఢసారె సమర్పించారు. ప్రధాన అర్చకుడు చేబ్రోలు బాబీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ కార్యదర్శి యెండూరి సురేష్, తమ్మన నారాయణ, దేసు సూర్యప్రకాశరావు, నంబూరి శ్రీను, కొల్లిపర శివాజీ, కోశాధికారి చేబ్రోలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** వాసవీ కన్యకా పరమేశ్వరీ, పార్వతీ అమ్మవారికి ఆషాఢ మాసం ఆర్యవైశ్య మహిళలు సోమవారం సారె సమర్పించారు. ప్రసన్న గణపతి స్వామి వారి ఆలయం నుంచి ఆర్యవైశ్యులు, మహిళలు సారెను ఊరేగింపుగా నినాదాలు చే స్తూ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ అర్చకులు కొల్లిపర సుబ్బారావు ప్రత్యేక పూజలు చేశారు. చిట్టా వీర అన్నపూర్ణయ్య, శివ నాగేశ్వరరావు, చిట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దానాశక్తి అమ్మవారికి..

కోడూరు : అన్నంవారి ఇలవేల్పు దానాశక్తి అమ్మవారికి అన్నం వారి వంశీయులు, గ్రామస్థులు ఆషాఢ సారెను సోమవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. 21 వివిధ రకాల పుష్పాలతోపాటు గోమాత, కుబేర, గవ్వలు, గాజులు, గురువింద గిం జలు, ముత్యాలు, పగడాలు, పలు రకాల 21 హారతులు అమ్మవారికి సమర్పించారు. అన్నంవారి ఆడపడుచులు పసుపు, కుం కుమ, చీరలు, గాజులతోపాటు వివిధ రకాల మిఠాయిలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



మండల సమావేశం 19న

మోపిదేవి, జూలై 15 : మోపిదేవి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ నడకుదుటి జనని కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పాలకవర్గ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

రెండురోజులకోసారి నీటి సరఫరా

పెడన : పట్టణ ప్రజలకు మంగళవారం నుంచి రెండురోజులకోసారి మంచినీరు సరఫరా చేస్తామని కమిషనర్ బి. వెంకట్రామయ్య తెలిపారు. నీటి లభ్యత లేనందున ఇప్పటి వరకు మూడు రోజులకోసారి మంచినీరు అందిస్తూ వచ్చామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాల్వలకు నీరు విడుదల చేసినందున మంగళవారం నుంచి రెండు రోజులకోసారి మంచినీరు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.